క్లుప్తంగా

రెండు బైకులు ఢీ, ముగ్గురికి గాయాలు



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయాలు పాలయ్యారు. రాజాం మున్సిపాల్టీ పరిధి గోపాలపురం సమీపంలో కొత్తవలస గ్రామానికి చెందిన పెరుమాలి నారాయణరావు, గోపాలపురానికి చెందిన బొండపల్లి ధనుంజయ, ఆమిటి గణేష్‌లు ఎదురెదురుగా ద్విచక్రవాహనంపై వస్తుండగా ప్రమాదవశాత్తు ఢీకొన్నారు. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి, అనంతరం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. దీనిపై తకు ఇంతవరకు ఎటువంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వివేక్‌ఆనంద్ శ్రీనివాస్

రాజాం సిటీ: ఈ నెల 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్ కోరారు. స్థానిక కోర్టు సముదాయంలో బుధవారం న్యాయవాదులు, పోలీసు, ఎన్‌జీఓ సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీకి అవకాశం ఉన్న కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. లోక్ అదాలత్ తీర్పే అంతిమమని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

బాడంగి: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6,7,8,9వ తరగతుల్లో మిగులు సీట్లలో ప్రవేశానికి గురువారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.రామదాసు తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. పాఠశాలలో ఆయా తరగతుల్లో ప్రవేశాల కోసం 150 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు గంట ముందు గురుకుల పాఠశాలకు చేరుకోవాలని హాల్ టికెట్లు తీసుకుని పరీక్షకు హాజరు కావాలని సూచించారు. మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నట్లు చెప్పారు.

అవన్నీ అసత్య ప్రచారాలు

బొబ్బిలి: దాదాపు 120 సంవత్సరాల పైబడి చరిత్ర గల సీబీఎం గరల్స్ హైస్కూల్ స్థలాన్ని విక్రయిస్తున్నట్టు వచ్చిన వార్తల్లో నిజం లేదని, త్వరలోనే ఆన్‌లైన్‌లో అపరాధ రుసుంతో కలిపి రికగ్నైజేషన్ కోసం దరఖాస్తు చేస్తామని కరస్పాండెంట్ ఎం.రత్నకుమార్ అన్నారు. సీబీఎం స్కూల్‌ను వేరే చోటకు తరలించనున్నారని, పాఠశాల స్థలాన్ని విక్రయించేందుకు చూస్తున్నారని కొద్ది రోజులుగా ప్రచారం సాగుతోంది. దీనిపై బుధవారం ఆయన స్పందించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, సీబీఎం సంఘ కార్యవర్గంతో సమావేశమయ్యారు. పాఠశాల తరలింపుపై వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు. అన్యాక్రాంతమైన సీబీఎం స్టాఫ్ క్వార్టర్స్ స్థలాన్ని తిరిగి కైవసం చేసుకుంటామన్నారు. త్వరలోనే 150 వసంతాల వేడుకలు ఇక్కడ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సీబీఎస్‌సీ అధ్యక్షుడు కె.అదృష్టకుమార్, సీబీఎం అధ్యక్ష, కార్యదర్శులు జి.వేణు, ఎంజే అప్పారావు, కోశాధికారి జి.విజయకుమార్, హెచ్ఎం పెంకి సునేత్రి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ



వెంకమ్మపేట ఆర్‌బీకే వద్ద విత్తనాల పంపిణీ

రేగిడి: మండలంలో వెంకమ్మపేట, తునివాడ గ్రామాల్లోని ఆర్‌బీకేల వద్ద బుధవారం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌ల చేతులమీదుగా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ రైతులకు విత్తనాలు అందజేశారు.

మంచినీటి బావుల క్లోరినేషన్

వంగర: మండల కేంద్రం వంగరలో తాగునీటి బావుల క్లోరినేషన్ బుధవారం చేపట్టారు. స్థానిక సచివాలయ కార్యదర్శి సవలాపురపు రామారావు ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లో ఉన్న తాగునీటి బావులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేపట్టారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు రామారావు తెలిపారు. ఏఎస్ఎం బి.విశాలాక్షి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు



బొబ్బిలి: ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు



బొబ్బిలి: ఎన్టీఆర్ జంక్షన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



రాజాం సిటీ: అంబేడ్కర్ జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, వివిధశాఖల సిబ్బంది



బాడంగి: మాట్లాడుతున్న ఎస్సై జయంతి



తెర్లాం: వేంకటేశ్వర కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు



రామభద్రపురం: ర్యాలీలో పాల్గొన్న ఎస్సై జ్ఞానేశ్వరరావు, విద్యార్థులు



సంతకవిటి: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



సంతకవిటి: మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

బొబ్బిలి: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు చేపట్టారు. బొబ్బిలి పట్టణంలోని వివిధ రహదారుల్లో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, బొబ్బిలి సీఐ ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని కోరారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, చట్టంలోని శిక్షలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

● **రాజాం సిటీ:** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండడంతో పాటు సన్మార్గాన్ని అలవర్చుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసులు, ఎస్ఈబీ సిబ్బంది, విద్యార్థులతో కలిసి బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోర్టు ప్రాంగణం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. గంజాయి, హెరాయిన్, నల్లమందు వంటి మత్తుపదార్థాలు ఆరోగ్యానికి హానికరమని అన్నారు. పిల్లల ప్రవర్తన, అలవాట్లను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని కోరారు. చెడు వ్యసనాలకు లోనై జీవితాలు పాడుచేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు, ఎస్సై వై.రవికిరణ్, ఎస్ఈబీ ఎస్సై ఎస్.చంద్రశేఖర్, శెట్టి పోలారావు, ఆర్‌ఈసీహెచ్ జయదేవ్, సీహెచ్ శంకరరావు, రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్య, యాదవ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్నహైందవి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

● **బాడంగి:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల తలెత్తే దుష్పరిణామాలపై ఎస్సై ఆర్.జయంతి అవగాహన కల్పించారు. ఇటీవల గంజాయి, డ్రగ్స్ కేసుల్లో పట్టుబడుతున్న వారితో యువతే అధికంగా ఉండటం బాధ కలిగిస్తోందన్నారు. యువత చెడు అలవాట్లతో జీవితాలు పాడుచేసుకోవద్దని, తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, ఏఎస్సై పెంటయ్య, పోలీసు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

● **రామభద్రపురం:** యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై జ్ఞానేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో వేంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. గాంధీ బొమ్మ వద్ద మానవహారంగా ఏర్పడి మత్తుపదార్థాల వల్ల కలిగే నష్టాలపై యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● **తెర్లాం:** విద్యార్థులు మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక వేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మత్తుకు బానిసై జీవితాలు పాడుచేసుకోవద్దని, బాగా చదువుకుని తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలని విద్యార్థులను కోరారు. తెర్లాం ఏఎస్సైఐ మల్లేశ్వరరావు, సిబ్బంది, వేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

● **సంతకవిటి:** యువత మత్తుకు దూరంగా ఉండాలని ఎస్సై షేక్ శంకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ యూనిట్, పోలీస్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా మండల కేంద్రంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ర్యాలీలో కళాశాల ప్రిన్సిపాల్ కె.జనార్దన్, ఎన్ఎస్ఎస్ పీఓ షణ్ముఖరావు, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువకుల హల్‌చల్

- రాజాంలో రెచ్చిపోతున్న అల్లరిమూకలు
- శ్రీకాకుళం యువకుడిపై దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రాజాం సిటీ: మద్యం మత్తులో రాజాం పరిసర ప్రాంతాల్లో యువకులు హల్‌చల్ చేయడంతో ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. ఈ క్రమంలోనే రాజాంలోని ఓ ఫంక్షన్‌కు వచ్చిన శ్రీకాకుళానికి చెందిన యువకుడిపై దాడిచేయడంతో ఆస్పత్రి పాలయ్యాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 25న పట్టణంలోని గొల్లవీధిలో జరిగిన ఓ ఫంక్షన్‌కు శ్రీకాకుళం గుజరాతీపేటకు చెందిన టి.గౌతమ్, కె.గణేష్, కె.ఆదర్స్, కె.రోహిత్‌లు వచ్చారు. మధ్యాహ్నం భోజనాల అనంతరం గుజరాతీపేటకు చెందిన యువకులు గొల్లవీధికి చెందిన తన స్నేహితుడు కార్తీక్‌తో పాటు మరికొంతమంది యువకులతో కలిసి జీఎంఆర్ కాలేజీ వైపు వెళ్లి తిరిగి వస్తున్నారు. పాలకొండ రోడ్డులోని డొంకలు మిల్లు వద్దకు వచ్చేసరికి అప్పటికే బార్ దగ్గర్లో మద్యం మత్తులో ఉన్న కుప్పిలి నవీన్, అతని స్నేహితులు వారితో గొడవకు దిగారు. ఈ గొడవలో గొల్లవీధి గ్రామస్తులు పారిపోగా గౌతమ్‌ను నవీన్, అతని స్నేహితులు స్కూటీపై ఎక్కించుకుని గురవాం సమీపంలోని ఓ మామిడితోటలో తీసుకువెళ్లారు. అక్కడ తాళ్లతో కట్టి కర్రలు, బెల్టుతో ముఖం, వీపుపైపు విచక్షణ రహితంగా కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డు పక్కన కూర్చున్న గౌతమ్‌ను తన స్నేహితుడు కార్తీక్ సహాయంతో రాజాం కేర్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంతకవిటి పోలీసులు తెలిపారు.

భయాందోళనలో పట్టణవాసులు

ఇదిలా ఉండగా ఈ నెల 25న రాత్రి 7 గంటల సమయంలో యువకులు సంతకవిటి రోడ్డులో కర్రలతో ఉన్నారని స్థానికులు వాపోతున్నారు. యువకులు మద్యంకి అలవాటు పడి ఇలా గుమిగూడి తిరగడంతో ఒంటరిగా వచ్చిన వారికి ఎప్పుడు ఏమౌతుందోనని భయాందోళనలు చెందుతున్నారు. గతంలో కూడా డొంకలమిల్లు జంక్షన్ వద్ద యువకులు పట్టపగలే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటనను గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రాత్రి సమయంలో గురవారం, శ్రీకాకుళం రోడ్డు, సంతకవిటి రోడ్డు, బుచ్చెంపేట రోడ్డు, బొబ్బిలి రోడ్డు, చీపురుపల్లి రోడ్డులో గస్తీ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడాలి



రేగిడి: బూరాడ యూపీ పాఠశాలలో సర్వేను పరిశీలిస్తున్న ఎంఈఓ

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు పెంచుకోవాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని బూరాడ, సోమరాజుపేట, లక్ష్మీపురం, ఖండ్యాం తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో బుధవారం లెర్నింగ్ ఎచీవ్‌మెంట్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్యార్థుల మానసిక సామర్థ్యాలను అంచనా వేస్తున్నామని వెల్లడించారు. విద్యార్థులకు అధునాతన పద్ధతిలో పాఠ్యాంశాలను బోధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు కె.అప్పలరాముడు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావు, సీఆర్‌పీ కెంబూరు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

● **రాజాం:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెరిగేలా ఉపాధ్యాయులు దృష్టిసారించాలని ఎంఈఓ యాగాటి దుర్గారావు అన్నారు. మండలంలో సోపేరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతంపై ఆరాతీశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరిశీలించారు. పిల్లలకు అర్థమయ్యేలా, ఆసక్తి కలిగించేలా బోధన ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలుచేయాలని, వారంలో ఒకరోజు పిల్లల తల్లిదండ్రులలో ఒకరు పాఠశాలలో భోజనం చేసేలా భాగస్వామ్యం కల్పించాలని హెచ్ఎం అడపా వెంకటరావుకు సూచించారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి

వంగర: పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈఓ పి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎం.సీతారాంపురం ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, తరగతులు నిర్వహణ, పీఎం పోషణ వంటకాలను పరిశీలించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, సీఆర్పీ సాకేటి శ్రీనివాసరావు ఉన్నారు.

గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

బొబ్బిలి: గతంలో అధికారంలో ఉన్న సమయంలో మున్సిపల్ కార్మికులకు టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పాట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా పారిశుద్ధ్య కార్మికులతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014–19 మధ్య అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు డీఏ, వేతనం కలిపి నెలకు రూ.25 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. జీవో 96ను కూడా విడుదల చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ఆ హామీని ఇప్పుడు అమలు చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ ప్రసాదరావుకు వినతిపత్రం అందించారు. యూనియన్ అధ్యక్షుడు జి.గౌరేష్, కార్యదర్శి జె.రామారావు, బి.వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ద్వితీయ స్థానం

వంగర: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో మద్దువలస జూనియర్ కళాశాల జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ కొరటాన నారాయణరావు బుధవారం తెలిపారు. ఎంపీసీ గ్రూపులో 34 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. బైపీసీలో 37 మందికి 36 మంది, సీఈసీలో 17 మందికి 16 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కళాశాల నుంచి 88 మంది పరీక్షలు రాయగా 86 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. 97.72 శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో ఈ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్



ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు

రాజాం: ప్రకృతి పద్ధతుల్లో సాగుచేసే పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని ప్రకృతి వ్యవసాయం ఆర్టీఓ హేమసుందర్, ఆర్‌పీఎల్ ప్రకాష్ అన్నారు. మండలంలో గార్రాజుచీపురుపల్లి, బొమ్మినాయుడువలస గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై బుధవారం అవగాహన కల్పించారు. నవధాన్యాల పంటల సాగుతో భూమి సారవంతంగా మారుతుందన్నారు. చీడపీడల నివారణకు కషాయాలు, జీవామృతాలు వినియోగించడం ద్వారా నాణ్యమైన పంట దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ బి.రమాదేవి, ఐసీఆర్‌పీ శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధిహామీ ఏపీఓ హరనాథరావు

రేగిడి: ఉద్యాన పంటల సాగు ప్రోత్సాహంలో భాగంగా రైతులకు వివిధ రకాల పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఏపీఓ ఎస్.హరనాథరావు తెలిపారు. మండలంలో వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, అంబఖండి తదితర గ్రామాల్లోని రైతులకు బుధవారం మొక్కలు పంపిణీపై అవగాహన కల్పించారు. మొక్కలు కావాల్సిన రైతులు ముందుగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఐదెకరాల లోపు భూమి కలిగిన సన్న, చిన్నకారు రైతులకు ఉచితంగా బొప్పాయి, జామ, సపోట, కొబ్బరి, జీడి తదితర పండ్ల మొక్కలు అందివ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సహారా యాజమాన్యానికి కొమ్ముకాస్తున్న బీజేపీ

బొబ్బిలి: కోట్లాది మంది భారతీయులు వేల కోట్ల రూపాయల సహారాలో పెట్టుబడి పెట్టి నష్టపోయారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పాట్నూరు శంకరరావు అన్నారు. పట్టణంలోని మహారాణిపేటలో సహారా ఇండియా సభ్యత్వ కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక వడ్డీ ఇస్తామని చెప్పి కోట్లాది మంది వద్ద డిపాజిట్లను సేకరించి పెద్ద అవినీతికి పాల్పడ్డారన్నారు. బాధితులకు వడ్డీలు కూడా చెల్లించకుండా బీజేపీతో లాలూచీ పడిందన్నారు. ఏజెంట్లు కోర్టుకు వెళ్లగా దీనిపై విచారణకు కోర్టు కమిటీ వేసిందని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న బీజేపీ సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సభ్యులు, కార్యకర్తలతో జూలై 5న భారీ సమావేశం నిర్వహించి బీజేపీ మోసాన్ని ప్రజలకు తెలియజేయనున్నట్లు చెప్పారు. సహారా బాధితులంతా వచ్చే నెల 5న బొబ్బిలి గంటి ప్రసాదం స్మారక భవనంలో జరిగే సమావేశానికి హాజరు కావాలని కోరారు.

సంక్షిప్తంగా..


పరిశుభ్రతతో వ్యాధులు దూరం



సిబ్బందికి సూచనలిస్తున్న ఇన్‌ఛార్జి ఆర్డీఓ మురళీకృష్ణ

బొబ్బిలి: పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ఇన్‌చార్జి ఆర్డీఓ పి.మురళీకృష్ణ అన్నారు. డివిజన్‌లోని అన్ని శాఖల సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

సకాలంలో సేవలందించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం సిటీ: వివిధ సేవల కోసం సచివాలయాలకు వచ్చే ప్రజలకు సకాలంలో సేవలందించాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. రాజయ్యపేట, కంచరాం సచివాలయాలను సందర్శించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఫీల్డ్ విజిట్‌కు వెళ్లే సిబ్బంది మూమెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు.

ఉపాధిహామీ రికార్డులు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు

బాడంగి: మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులను సిద్ధం చేయాలని ఎంపీడీఓ ఆంజనేయులు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ అధికారులతో బుధవారం సమావేశమయ్యారు. సామాజిక తనిఖీల నేపథ్యంలో రికార్డులను సిద్ధం చేయాలని సూచించారు. పనుల వివరాలు, చెల్లింపులు తదితర వివరాలు స్పష్టంగా ఉండాలన్నారు. సమావేశంలో ఉపాధిహామీ ఏపీఓ విజయలక్ష్మి, ఈసీ బుజ్జి, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన మెనూ కచ్చితంగా అమలు చేయాలి



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంఈఓ జె.త్రినాథరావు అన్నారు. మండలంలోని కాగాం ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, మరుగుదొడ్ల నిర్వహణ, పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎలాంటి లోపాలను సహించేదిలేదన్నారు. మెనూ సక్రమంగా అమలు జరిగేలా చూడాలని, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మట్టి నమూనాల సేకరణ



మట్టినమూనాలు సేకరిస్తున్న ఆర్బీకే సిబ్బంది

రామభద్రపురం: భూసార పరీక్షలు చేయడం వలన నేలకు రక్షణ కల్పించడమేనని ఏఓ వెంకటయ్య అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ సాగు సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రభలకుండా చర్యలు



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ పి.రవికుమార్ సూచించారు. తన కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబల కుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కాలువల్లో పూడికలు తొలగించాలని, రక్షిత పథకాలను క్లోరినేషన్ చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రావణకుమార్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన వంటలు రుచిగా ఉండాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. రేగిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల హెచ్ఎం లక్ష్మణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షం


తెర్లాం/బాడంగి/రేగిడి/సంతకవిటి: తెర్లాం, బాడంగి, రేగిడి, సంతకవిటి మండలాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. రోడ్లు, తోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. పంటపొలాల్లో నీరు చేరి చెరువులను తలపించాయి. ఈ వర్షం ఖరీఫ్ సాగుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు. బాడంగి మండలంలో సుమారు 81 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు సహాయ గణాంక అధికారి ఎ.సరోజిని తెలిపారు.



తెర్లాం: పెరుమాళిలో చెరువులను తలపిస్తున్న పొలాలు



బాడంగి: ముగడకాలనీలో రోడ్డుపై పారుతున్న వర్షపునీరు



సంతకవిటి: మద్దూరుపేట పంటపొలాల్లో చేరిన వర్షం నీరు